సాక్షి నారాయణపేట

శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



నత్తకే.. నడక

'పాలమూరు' ఎత్తిపోతలకు సంబంధించి పునరావాస ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

వివరాలు 8లో ▸



మంత్రాలమ్మ ఉత్సవాలు

కోడేరు మండలం జనుంపల్లిలో మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸



వాతావరణం

రోజంతా ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత తప్పదు. అర్ధరాత్రి తర్వాత చల్లని గాలులు వీస్తాయి.

రేపు 'సాక్షి' ఫోన్ ఇన్



నారాయణపేట, కోస్గి మున్సిపాలిటీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. నారాయణపేట మున్సిపల్ కమిషనర్ సునీత, అలాగే కోస్గి మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు పాల్గొంటారు. కుక్కలు, కోతుల బెడద, తాగునీటిఎద్దడి, పారిశుద్ధ్య లోపం, వెలగని వీధి లైట్లు తదితర సమస్యలను పుర ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లవచ్చు. వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారు.

తేది: 25.02.2023

సమయం: ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు:

నారాయణపేట : **96180 90288**

కోస్గి : **81210 94097**

'తొలిమెట్టు'పై పర్యవేక్షణ



పెద్దకడ్మూర్ పాఠశాలలో విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న సీఆర్పీ

- అందుబాటులో స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్
- విద్యార్థుల అక్షర ప్రగతి తెలుసుకునేందుకే..
- సత్ఫలితాలిస్తుందంటున్న ఉపాధ్యాయులు

నర్వ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాల స్థాయిని పొంపొందించేలా విద్యాశాఖ ఈ ఏడాది ఆగస్టు 16 నుంచి ప్రతిష్ఠాత్మకంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలుచేస్తోంది. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించడంతో పాటు విద్యార్థుల ప్రగతిని పరిశీలించేందుకు విద్యాశాఖ స్టూడెంట్ లెర్నింగ్ ట్రాకింగ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు ఇందులో నిక్షిప్తం చేస్తున్నారు. ఈవిధానంతో రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రగతి, విద్యాప్రమాణాలు తెలుసుకునే అవకాశం ఉంది.

సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకత పెంపు..

ప్రధానంగా ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, అక్షరాలను గుర్తించడం, తప్పనిసరిగా వచ్చేలా చేయడానికి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ)లో భాగంగా తొలిమెట్టు కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రాథమిక పాఠశాలలోని పిల్లలందరికీ (1నుంచి 5వ తరగతి వరకు) మౌలిక భాషా, గణిత సామర్థ్యాల సాధన కోసం ఈ కార్యక్రమం అమలవుతోంది. డీఈఓ, సెక్టోరియల్ అధికారులు, మండల నోడల్ అధికారులు, ఎంఈఓలు, పాఠశాల సముదాయ చైర్మన్‌లు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శిస్తున్నారు. వీరికి జిల్లాస్థాయిలో డీఆర్పీ (డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్), ఎమ్మార్పీలు (మండల రిసోర్స్ పర్సన్‌లు)సీఆర్పీ (క్లస్టర్ రిసోర్స్ పర్సన్)లు సహకారం అందిస్తున్నారు. తనిఖీ నామమాత్రంగా నిర్వహించకుండా పారదర్శకత పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభిస్తున్నారు.

పాఠశాలల్లో తనిఖీకి వెళ్లిన సముదాయ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఈయాప్‌లో నమోదు చేస్తున్నారు. జీపీఎస్ అనుసంధానం ఉండటంతో అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షణకు వెళ్తున్నారు. బేస్‌లైన్ టెస్ట్ ఆధారంగా విద్యాప్రమాణాల స్థాయి ప్రగతి పాఠశాలలో ఎలా నమోదు చేశారనే దానిపై మరోసారి ఈయాప్ ద్వారా మానిటరింగ్ బృందం పరిశీలిస్తున్నారు. విద్యార్థుల ప్రగతి ఎంత వరకు వాస్తవమో పరిశీలిస్తున్నారు. తరగతిలో ఒకరిద్దరిని పరీక్షిస్తున్నారు. దీంతో విద్యార్థి వాస్తవ సామర్థ్యాలు నమోదవుతున్నాయి. తొలిమెట్టు కార్యక్రమం భాగంగా వారంలో ఐదురోజుల పాటు బోధన ఒకరోజు మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. ప్రతినెలా చివరివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి లోపాలను సమర్పిస్తున్నారు.

యాప్‌లో వివరాల నమోదు..

ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు
312	85

యాప్ ద్వారా నమోదైన విద్యార్థులు

1వ తరగతి	6,500
2వ, తరగతి	6,088
3వ, తరగతి	5,848
4వ, తరగతి	6,978
5వ, తరగతి	6,550

ప్రగతి తెలుసుకోవచ్చు..



విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా తొలిమెట్టు కార్యక్రమం జిల్లాలో పకడ్బందీగా కొనసాగుతోంది. పాఠశాల స్థాయిలో పర్యవేక్షణ ముమ్మరంగా చేస్తున్నాం. ప్రతి విద్యార్థి అభ్యాసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా పర్యవేక్షించవచ్చు. దీంతో ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది.

– విద్యాసాగర్ ఏఎంఓ, నారాయణపేట

'మన బడి'తో వసతుల కల్పన



మొగుల్‌మడ్క హైస్కూల్‌లో హెచ్‌ఎంతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- ఎస్ఎస్ఏ ఏఈపై కలెక్టర్ ఆగ్రహం
- ఉపాధ్యాయులు పనితీరు మార్చుకోవాలి
- వైద్యసేవలపై అసంతృప్తి

దామరగిద్ద: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు–మనబడి కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. గురువారం మండలంలోని దామరగిద్ద, క్యాతన్‌పల్లి, వత్తుగుండ్ల, నన్సాపూర్, మొగుల్‌మడ్క, వితలపూర్, మల్‌రెడ్డిపల్లి, గడిమున్కన్‌పల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమం ద్వారా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠ్యప్రణాళిక ఆధారంగా బోధించాలని చెప్పారు. బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. పది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించేలా కృషి చేయాలన్నారు. ఆయా ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం పనులు ఆలస్యమవడంతో ఏఈపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్ఎంసీ కమిటీలు త్వరగా పనులు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించి ప్రభుత్వ ఆస్పత్రి సేవలపై విశ్వాసాన్ని కలిగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఎంఈఓ వెంకటయ్య, ఏఈ రఘునందన్, నర్సింగ్‌రావ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ శశికళ, హెచ్‌ఎంలు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.కోటి ఆశ చూపి.. న్యూడ్ ఫొటోలు సేకరణ

- నిరుపేద మహిళలే వారి టార్గెట్
- నలుగురు నిందితులకు రిమాండ్, పరారీలో మరొకరు
- వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన సీఐ రమేశ్‌బాబు, తదితరులు

జడ్చర్ల: నిరుపేద మహిళలను లక్ష్యంగా చేసుకుని వారికి రూ.కోటి ఆశ చూపి న్యూడ్ ఫొటోలు, వీడియోలు సేకరించి హైదరాబాద్‌లో ఉన్న ఓ గురూజీకి పంపుతున్న నిందితులను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉండగా.. ఆ అజ్ఞాత గురూజీ ఎవరు అనే విషయం ఇంకా తేలలేదు. గురువారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రమేశ్‌బాబు న్యూడ్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన జైనుల్లాబుద్దీన్, నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం కోడుపర్తి గ్రామానికి చెందిన మస్కూరి రాములు, రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండలం పోలేపల్లికి చెందిన గంగాపురం శంకర్, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగడకు చెందిన రాత్లావత్ రామ్‌లాల్‌నాయక్ ఓ ముఠాగా ఏర్పడి మహిళల న్యూడ్ ఫొటోలు, వీడియోలను సేకరిస్తున్నారు. వీరిలో జైనుల్లాబుద్దీన్ బాదేపల్లిలో నివాసం ఉంటుండగా.. గంగాపురం శంకర్ జడ్చర్ల మండలం బండమీదిపల్లి శివారులోని కోళ్లఫారంలో పనిచేస్తున్నడు. రామ్‌లాల్‌నాయక్ హైదరాబాద్‌లోని నిజాంపేటలో నివాసం ఉంటున్నాడు. కాగా..వితంతు, నిరుపేద మహిళలను వీరు ఎంపిక చేసుకొని వారికి కోటి రూపాయలు వస్తాయని ఆశచూపి వల విసురుతారు. మొదటగా మామూలు ఫొటోలు, వారి శరీర కొలతలు తీసుకుంటారు. కొన్ని రోజుల తర్వాత న్యూడ్ ఫొటోలు, వీడియోలు తీసుకుని హైదరాబాద్‌లో ఉంటున్న మరో నిందితుడు తిరుపతికి పంపుతారు. తిరుపతి ఆదేశాల మేరకు సదరు మహిళలను రాంలాల్‌నాయక్ హైదరాబాద్ తీసుకెళ్లి తాము తీసుకున్న కొలతల ప్రకారంగా ఎంపిక చేసే ప్రక్రియను చేపడుతారు. ఒకవేళ అక్కడ మహిళలు ఎంపిక కానియెడల వారిని తిరిగి వెనక్కి పంపుతారు. అయితే అక్కడ ఎంపిక విధానం ఎలా ఉంటుందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. ప్రధాన నిందితుడు తిరుపతి పరారీలో ఉన్నారని, ఆయన అరెస్టు అయితేనే పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. తిరుపతి చెబుతున్న గుర్తు తెలియని గురూజీ ఎవరన్నది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. కాగా.. ఆయా న్యూడ్ ఫొటోలను ఇంటర్‌నెట్‌లో అప్‌లోడ్ చేసి డబ్బు సంపాదించాలన్న ఆలోచన కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడయిందని పోలీసులు పేర్కొన్నారు.

యుక్త వయసు వారే టార్గెట్..

యుక్త వయసు ఉన్న మహిళలనే వీరు టార్గెట్ చేసుకొని 18 నుంచి 30 ఏళ్ల వారిని ఎంపిక చేసుకొని.. వారి ఇంటికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసుకుంటారని, తమ గురూజీ ఎంపిక చేసిన వారికి రూ.కోటి వస్తుందని నమ్మబలుకుతారు. ఇలా జడ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాలలో మూడు నెలలుగా ఈ ముఠా మహిళలపై వల విసిరి న్యూడ్ ఫొటోలు, వీడియోలు సేకరిస్తున్నారు. వీరి ఉచ్చులో ఇప్పటి వరకు దాదాపు 25మంది మహిళల వరకు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

100 డయల్‌కు ఫిర్యాదు..

బాదేపల్లి పాతబజార్‌లోని ఓ ఇంటిలో ఓ మహిళను న్యూడ్ ఫొటోలు తీస్తున్నారని 100 డయల్‌కు ఈనెల 18న ఫిర్యాదు రావడంతో తాము స్పందించినట్లు సీఐ తెలిపారు. వెంటనే తాము అక్కడకు వెళ్లి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టి మిగతా నిందితులను అరెస్ట్ చేశామన్నారు. తరువాత ఇద్దరు బాధిత మహిళలు తమకు ఫిర్యాదు చేశారని, మరో నిందితుడు తిరుపతిని త్వరలోనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం



మద్దూరు: ఉపాధి కూలీలకు పని కల్పించడం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని డీఆర్‌డీఏ పీడీ గోపాల్‌నాయక్ తెలిపారు. గురువారం మద్దూరు, కొత్తపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టీఏలు, క్షేత్ర సహాయకులతో ఉపాధి పనులపై ఎంపీడీఓ విజయలక్ష్మితో కలిసి సమీక్ష నిర్వహించారు. టీఏ ప్రకాష్‌బాబు లైబర్ మొబిలైజేషన్, ఉపాధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందున పీడీ టీఏను సస్పెండ్ చేశారు. గ్రామాల్లో వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని కూలీలకు పని కల్పించాలని సూచించారు. టార్గెట్‌లు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ నాగరాజు, ఈసీ జేపీ పాల్గొన్నారు.

అప్రమత్తానికి కమ్యూనిటీ పోలీసింగ్

నారాయణపేట రూరల్: ప్రజలు మోసాలు, నేరాలబారిన పడకుండా తప్పించడానికి, అవగాహన కల్పించేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ ఉపకరిస్తుందని వర్టికల్ ఇన్‌చార్జ్ శ్రీదేవి అన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పీఎస్‌ల పరిధిలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వాణిజ్య సముదాయలు, కాలనీ అసోసియేషన్ కమిటీలతో సమావేశం నిర్వహించాలని చెప్పారు. వివిధ సంఘాల ముఖ్య నాయకులతో మాట్లాడి ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు వైరస్ వ్యాప్తి నియంత్రణకు వారి నుంచి సలహాలు తీసుకుంటూ, అవసరమైన సూచనలు చేసి అమలు జరిగేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు.

ఉపాధి హామీలో కూలీలను పెంచాలి



బిజ్జారంలో విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

కోస్గి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సంఖ్య పెంచాలని, నిబంధనల మేరకు చేసిన పనులను నమోదు చేసి సకాలంలో కూలీలకు డబ్బులు అందజేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని బిజ్జారంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీని, మన ఊరు–మన బడి పథకంలో భాగంగా కొనసాగుతున్న పనులను పరిశీలించారు. అర్ధంతరంగా ఆగిపోయిన నూతన జీపీ భవన నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధి పనులకు కూలీలు నామమాత్రంగా హాజరవుతున్నట్లు గుర్తించి ఇబ్బందులపై ఆరా తీశారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థుల చదువు సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలురికార్డులను తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి కంటి పరీక్షలకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఎంపీఓ రహమత్, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు, ఏపీఓ మాధవరెడ్డి, సర్పంచ్ సంగీతతోపాటు పలువురు ఉన్నారు.

అదానీ, మోదీలది చీకటి ఒప్పందం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి

నారాయణపేట: దేశ సంపదను అదానీకి దోచిపెడుతూ, దాచుకునేలా ఇద్దరి మధ్యన చీకటి ఒప్పందం కుదిరిందని డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి ఆరోపణలు చేశారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో (సీవీఆర్ భవన్)లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని మోదీ తన కార్పొరేట్ స్నేహితులకు దేశ ఖజానాను దోచిపెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై పార్లమెంట్‌లో చర్చ జరుగకుండా బీజేపీ ప్రజల దృష్టిని మరలిస్తుందన్నారు. మోదీ మిత్రుడు అదానీ అనుభవం లేకున్నా రూ.లక్షల కోట్లు కాంట్రాక్టులు మోదీ ప్రభుత్వం అప్పగించిందన్నారు. అదానీ కుంభకోణంపై సీబీఐ, సెబీ, ఈడీ సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుల ఎండి గౌస్, సుధాకర్, సదాశివారెడ్డి, నర్సింహులు, కోర్ల రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ సలీం, ఆనంద్‌గౌడ్, గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలనతో.. నిస్తేజం

- క్రీడా యువజన శాఖలో కనిపించని రెగ్యులర్ అధికారులు
- మహబూబ్‌నగర్ మినహా మిగతా జిల్లాల్లో మరీ దయనీయం
- క్రీడాశాఖ కార్యాలయాల్లోనూ వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఆ నాలుగు జిల్లాలో కుంటుపడిన క్రీడాభివృద్ధి
- ఆందోళనలో ఔత్సాహిక క్రీడాకారులు



మహబూబ్‌నగర్ క్రీడలు: ఇతర రంగాల్లో దూసుకెళ్తున్న తెలంగాణ క్రీడారంగంలో పూర్తిగా వెనకబడిపోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. కేవలం స్టేడియంల నిర్మాణాలపై దృష్టిసారిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యువజన, క్రీడశాఖలకు సరిపడా అధికారులు, ఉద్యోగుల కేటాయింపు చేయడం లేదని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు.

➪ రాష్ట్రంలో నూతన జిల్లాల ఏర్పాటు తర్వాత డీఎస్ఏలను (జిల్లా యువజన, క్రీడాశాఖ) డీవైఎస్ఓలుగా మార్చారు. నూతన జిల్లాల్లో యువజన, క్రీడా శాఖలను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ మినహా ఇతర నూతన జిల్లాల్లో యువజన, క్రీడాశాఖలు ఇన్‌చార్జ్ అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో యువజన, క్రీడాశాఖకు ఇన్‌చార్జ్‌లుగా ఇతర శాఖల అధికారులను నియమించారు. దీంతో వీరు తమ సొంత శాఖల్లో బిజీగా ఉండడంతో యువజన, క్రీడాశాఖల నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి.

మంత్రి చొరవ తీసుకోవాలి..



జిల్లా యువజన, క్రీడాశాఖలకు రెగ్యులర్ అధికారులను నియమించాలి. అది కూడా క్రీడా నేపథ్యంలో ఉన్న వారినే నియమిస్తే క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుంది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాలో క్రీడాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. అలాగే ప్రత్యేక చొరవ తీసుకొని వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాలకు రెగ్యులర్ అధికారులతోపాటు సరిపడా కోచ్‌లను నియమించాలి.

– ఖాజాఖాన్, జిల్లా నెట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

నిధుల లేమితో ఇక్కట్లు

వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లోని డీఎస్ఏల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. నిధుల లేమితో ఇవి కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ జిల్లాల్లోని డీవైఎస్ఓల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. కొన్ని కార్యాలయాల్లో కనీసం క్లరికల్ పోస్టులు కూడా లేకపోవడంతో రోజువారీ నిర్వహణ సైతం కష్టంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ జిల్లాల్లో ప్రత్యేక క్రీడాశాఖలు ఏర్పాటు చేసినా నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఫలితంగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో అర్థం కాని పరిస్థితి దాపురించింది. ఈ జిల్లాల్లో క్రీడలపరంగా సరైన సమాచారం లేకపోతుండడంతో క్రీడాకారులు ఒకింత ఆవేదన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ మినహా మిగతా నాలుగు జిల్లాల్లో రెగ్యులర్ డీవైఎస్ఓలను నియమించాలని కోరుతున్నారు. స్పోర్ట్స్ నేపథ్యం ఉన్న అధికారులు లేదా సీనియర్ కోచ్‌లను భర్తీ చేయాలని, జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయల్లో ఉద్యోగులు నియామకం చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియకు వెళ్లిన టీచర్లు
- సెలవు పెట్టకుండానే విధులకు డుమ్మా
- కలెక్టర్ హెచ్చరించినా పట్టించుకోని వైనం



బీమండికాలనీ పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ లియాకత్ అలీ

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈఓ లియాకత్‌అలీ హెచ్చరించారు. పట్టణంలోని బీమండి కాలని, ఊట్కూర్ పీఎస్, జక్లేర్ పాఠశాలలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తప్పకుండా టీఎల్ఎం ఉపయోగించాలని, ఎఫ్ఎల్ఎన్‌పై దృష్టి పెట్టాలని, నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. సమయపాలన పాటించాలని, సెలవుల విషయంలో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. బీమండి కాలనీలో టీచర్ సెలవు పెట్టడంతో సీఆర్పీ విధులకు వెళ్లకుండా మరో టీచర్‌ను అక్కడికి పంపించడం విమర్శలకు తావిస్తోంది. ఇక అక్కడ పనిచేస్తున్న మరో టీచర్‌ను డిప్యూటేషన్ ఇవ్వడాన్ని తప్పుపట్టిన డీఈఓ వెంటనే సదరు టీచర్‌ను వెనిక్కి పంపిస్తున్నట్లు చెప్పారు. ఊట్కూర్ పీఎస్‌లో అనుమతి లేకుండా సెలవు పెట్టి ప్రైవేటు వలంటీర్‌తో పాఠశాల నడపటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఊరు మన బడి పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు.

సెలవులపై ఆగ్రహం..

జిల్లాలో పనిచేస్తున్న టీచర్లు నిబంధనల ప్రకారం సెలవులు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం అనుమతి తీసుకోవాలని, తప్పకుండా సెలవు పత్రం పాఠశాలలో ఉంచాలని, అత్యవసర పరిస్థితిలో లీవ్ లెటర్‌ను పాఠశాల సమయానికి ముందే వాట్సప్‌లో చేరవేయాలని, దీనికి సంబంధిత అధికారి అనుమతి పొందాలన్నారు.

ఎవరికి వారే, యమునా తీరే..

హైదరాబాద్‌లో గురువారం జరిగిన ఎమ్మెల్సీ నామినేషన్ల ప్రక్రియకు జిల్లానుంచి పెద్ద ఎత్తున టీచర్లు తరలివెళ్లారు. అయితే పోటాపోటీగా టీచర్లను సమీకరించి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి మరీ తీసుకు వెళ్లారు. అయితే ఎన్నికల ప్రచారానికి వెళ్లే టీచర్లు నిబంధనల ప్రకారం సెలవు పెట్టి వెళ్లాలని, రెండు రోజుల క్రితమే కలెక్టర్ శ్రీహర్ష ఆదేశాలు ఇచ్చినా, పట్టించుకోకుండా టీచర్లు వ్యవహరించారు. వాస్తవానికి గురువారం ఎంత మంది టీచర్లు సెలవు పెట్టారనే విషయం విద్యాశాఖ అధికారులతో లెక్కలు లేవంటే కార్యాలయం ఎంత బాగా పనిచేస్తుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇక డీఈఓ విజిటింగ్‌కు వెళ్లిన సమయంలో కార్యాలయ బాధ్యతలు చూసుకోవాల్సిన సూపరింటెండెంట్ స్థానికంగా ఉండకుండా డీఈఓ వెంట కారులో తిరగడం విమర్శలకు తావిస్తోంది.

క్లుప్తంగా

ఉద్యోగం రాదని ఆత్మహత్య


మహేష్(ఫైల్)

మరికల్: పోలీస్ ఉద్యోగం రాదని ఓ యువకుడు మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండలంలోని మాధవరానికి చెందిన మహేష్ ఈ నెల 20న గ్రామ శివారులోని దత్తత్రేయ ఆలయం వద్దకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి మంటలను ఆర్పే సమయానికి 80 శాతం శరీరం కాలిపోయింది. చికిత్స నిమిత్తం వెంటనే అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మక్తల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఊట్కూర్ మండలం ఎడివెళ్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎడివెళ్లికి చెందిన పోతుల రామకృష్ణ(30) ఈ నెల 17న మక్తల్‌కు పని నిమిత్తం వచ్చి తిరిగి సాయంత్రం గ్రామానికి వెళ్తున్నాడు. టికులపల్లి వద్దకు రాగానే.. మక్తల్‌కు చెందిన కుర్వ బుడ్డప్ప ద్విచక్రవాహనంపై వెళ్తూ సిగ్నల్ ఇవ్వకపోవడంతో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో పోతుల రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లో నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోతుల రామకృష్ణ మృతిచెందినట్లు ఎస్ఐ పర్వతాలు తెలియజేశారు. మృతుడి మామ పెద్దకిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.


అనుమానాస్పదంగా మహిళ మృతి

కోస్గి: మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణ శివారులోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న ఓ దాబా సమీపంలో పాలమూర్–తాండూర్ ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని మహిళ(46) పడి ఉండటాన్ని కొందరు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జనార్దన్, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యుడిచే అక్కడే పరీక్ష చేయించగా ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొనగా ఇద్దరికి గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా వీపనగండ్లకు చెందిన సాయిరెడ్డి తన భార్య అనితతో కలిసి ఉదయం అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో కుమారుడిని వదిలేందుకు తమ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భార్యభర్తలు ఇద్దరు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఇటిక్యాల మండలంలోని కోదండాపురం స్టేజీ సమీపంలోకి రాగానే కారు అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా వనపర్తికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పాగాకు కంపెనీ స్టేజీలో వదిలేసి కారు యజమాని పరారు కాగా.. పోలీసులు కారును అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించారు.

గొర్రెల కాపరి అదృశ్యం


కుర్వ మహేష్

పాన్‌గల్: గొర్రెల కాపరి అదృశ్యమైన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేతేపల్లికి చెందిన కుర్వబండారి మహేష్(23) గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. రెండు నెలల కిందట ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కోసూరు మండలానికి గొర్రెలను మేపేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి వారం రోజుల కిందట సొంత గ్రామం కేతేపల్లి వెళ్తున్నాని చెప్పి అప్పటి నుంచి ఇంటికి రాకుండా అదృశ్యమైనట్లు పేర్కొన్నారు. బంధువులు, తెలిసిన వ్యక్తుల ఇళ్ల వద్ద వెతికినా సమాచారం లభించలేదన్నారు. దీంతో గురువారం పాన్‌గల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

నత్తకే.. నడక

సా..గుతున్న ఉదండాపూర్ పునరావాసం ఏర్పాటు


పోలేపల్లి శివారులో కొనసాగుతున్న పునరావాస పనులు

- ఆర్అండ్ఆర్‌కు రూ.171.55 కోట్లు కేటాయింపు
- ప్రాథమిక దశలోనే మగ్గుతున్న అభివృద్ధి పనులు
- మరోదిక్కు ముంపు గ్రామాల్లో కొలిక్కిరాని సమస్యలు
- ఆందోళన చెందుతున్న నిర్వాసితులు


పునరావాస స్థలంలో చేపట్టిన డ్రైయినేజీ, విద్యుత్ పనులు

జడ్చర్ల: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాలు, తండాలకు సంబంధించిన పునరావాస ప్రక్రియ నత్తకే నడక నేర్పుతున్నాయి. మొదటి నుంచి ముంపు గ్రామాల సమస్యలు సకాలంలో పరిష్కారం కాకపోవడంతో పాటు పునరావాస ప్రక్రియ సైతం అలాగే సాగుతోంది. రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభించి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రాథమిక దశను దాటలేదు. దీంతో నిర్వాసితులు తమకు అందించే పరిహారం, ఇతర సమస్యలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

15.91 టీఎంసీల సామర్థ్యంతో..

ఉమ్మడి జిల్లాతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ వద్ద 15.91 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. దీని ద్వారా సుమారు 5.42 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు హైదరాబాద్‌కు తాగునీరు అందించే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అయితే ఈ రిజర్వాయర్ నిర్మాణంలో జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్, వల్లూరుతోపాటు ఆయా పంచాయతీల పరిధిలోని తుమ్మలకుంటతండా, రేగడిపట్టతండా, చిన్నగుట్టతండా, ఒంటిగుడిసెతండా, నవాబుపేట మండలం తీగలపల్లి పంచాయతీ పరిధిలోని సామగడ్డతండాలు పూర్తిస్థాయిలో ముంపునకు గురవుతున్నాయి.

ఒకే దగ్గర పునరావాసం..

ఉదండాపూర్ రిజర్వాయర్‌తో 2,075 కుటుంబాలు సర్వం కోల్పోనున్నాయి. వీటికి సంబంధించి ఒకే దగ్గర పునరావసం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జడ్చర్ల, పోలేపల్లి శివారులో భూములను గుర్తించి పునరావాస ప్రక్రియ మొదలుపెట్టారు. ముంపు గ్రామాల పునరావాసానికి గాను 316 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో దాదాపు 76 ఎకరాలు పట్టా భూముల కాగా.. మరో 240 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. అయితే వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు సంబంధించి సరిహద్దులను గుర్తించి ప్లాట్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే కులాలు, మతాల వారీగా ప్లాట్లు కేటాయిస్తారా అనే దానిపై ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోనున్నారు.

కేటాయింపులు ఇలా..

జడ్చర్ల మండలంలోని బండమీదిపల్లి, పోలేపల్లి గ్రామాల శివారులో కేటాయించిన భూమిలో పునరావాసం, పునర్నిర్మాణం (ఆర్అండ్ఆర్) పనులకు ప్రభుత్వం రూ.171.55 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా 33.16 కి.మీ.,ల పొడవున అంతర్గత సీసీరోడ్లతోపాటు డ్రైయినేజీ, భూమి చదును పనులకు రూ.118.57 కోట్లు కేటాయించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణానికి రూ.6.55 కోట్లు, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పశువైద్య ఆస్పత్రి, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి రూ.8.83 కోట్లు, షాపింగ్ కాంప్లెక్స్, ఆలయాలు, పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్ల నిర్మాణానికి రూ.16.22 కోట్లు, పార్కులు తదితర సుందరీకరణ పనులకు రూ.5.01 కోట్లు, వీధిదీపాలు, విద్యుత్ సరఫరా పనులకు రూ.3.76 కోట్లు, ఇంటింటికి తాగునీటి సరఫరాకు రూ.11 కోట్లు, పరిపాలన విభాగానికి సంబంధించి రూ.1.69 కోట్లు వెచ్చించారు.

త్వరగా చేపట్టాలి..



ఒకవైపు ముంపు గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయింది. పైగా గ్రామాల చుట్టూ పెద్దఎత్తున రిజర్వాయర్ పనులు కొనసాగుతుండడంతో నివాస పరిసరాలు పూర్తి అధ్వానంగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో మరీ ఆందోళనకరంగా ఉంది. త్వరితగతిన పునరావాసం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– బాలాజీ, నిర్వాసితుడు, వల్లూరు

పురోగతిలో పనులు..



ఉదండాపూర్ రిజర్వాయర్ పునరావాస ప్రక్రియ ముందుకు సాగుతుంది. పోలేపల్లి శివారులో ఇందుకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆయా పనులకు టెండర్లు పిలిచి అప్పగించారు. పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

పరిహారంపై స్పష్టత కరువు

తమకు అందించే పరిహారం (రీ హాబిటేషన్, రీ సెటిల్‌మెంట్) ప్యాకేజీకి సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని నిర్వాసితులు చెబుతున్నారు. ఏ లెక్కల ప్రకారంగా తమ ఆస్తులను లెక్కిస్తున్నారు.. తమకు ఎంతమేరకు సహాయం చేస్తారో అర్థం కావడం లేదని వాపోతున్నారు. ఒక్కొక్కరికి ఒక్కోలా ఇంటి విలువలను లెక్కించడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఇంటికి ఎక్కువ.. పెద్ద ఇంటికి తక్కువ పరిహారం ఖరారు చేశారని పలువురు బాధితులు ఆరోపించారు. ప్రస్తుత మార్కెట్‌కు విలువ ప్రకారం ఇంటి నిర్మాణాలను లెక్కించకపోవడంతో తక్కువ పరిహారం వచ్చే పరిస్థితి తలెత్తిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమకు న్యాయపరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఎనిమిది నెలల క్రితం శంకుస్థాపన..

పోలేపల్లి శివారులో పునరావాస ప్రక్రియకు సంబంధించి గతేడాది జూన్ 22న స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం డ్రైయినేజీ, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే పునరావాసం కోసం ఎంపిక చేసిన స్థలంలో పెద్దఎత్తున గుట్టలు ఉండటంతో బండరాళ్ల తొలగింపు, చదును చేయడానికి అహర్నిశలు శ్రమించాల్సి వస్తోంది. కానీ, ఇందుకు తగ్గట్టుగా పనులు చేపట్టేందుకు అధికారులు దృష్టిసారించకపోవడంతో పనుల పురోగతి మందగించింది.

నిర్వాసితులు పాత ఇళ్లను వదలిరావాలి


నిర్వాసితులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

- అదనపు కలెక్టర్ మోతీలాల్

బిజినేపల్లి: వట్టెం జలాశయంలో నిర్వాసితులు అవుతున్న లబ్ధిదారులకు ఇప్పటికే ఇళ్ల స్థలాలు, నిర్మాణ ఖర్చులు అందజేశామని, వారు తమ పాత ఇళ్లను వదిలిరావాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ డా.మోతీలాల్ అన్నారు. గురువారం మండలంలోని ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నూతన కాలనీని అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వట్టెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో అనేఖాన్‌పల్లి, అనేఖాన్‌పల్లి తండా, జీగుట్ట తండా, రాంరెడ్డిపల్లి తండా, పోతిరెడ్డిపల్లి, కారుకొండ తండాలకు చెందిన నిర్వాసితులకు 60 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ.. 466 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. అంతే కాకుండా ఒక్కో కుటుంబానికి రూ.12,54,500 చెల్లించామని వివరించారు. ఇప్పటికే 30 శాతం మంది నిర్వాసితులు ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారని మిగిలిన 70 శాతం మంది ఆ పాత ఇళ్లను వదిలి త్వరితగతిన ఆర్అండ్ఆర్ కాలనీలో నూతన వసతి గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి సరఫరా, మురుగు కాల్వలు, నూతన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పారుదల ఎస్సీ పార్థసారథి, డీఈ ప్రతాప్, కృష్ణమాచారి, బిజినేపల్లి తహసీల్దారు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ వీడియో వైరల్ చేసిన వ్యక్తికి రిమాండ్

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండల పరిధిలోని మనిగిళ్ల గ్రామానికి చెందిన శివయాదవ్ అనే యువకుడు ఈనెల 20న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి సంబంధించి ఓ వీడియోను వాట్సప్ గ్రూప్‌లో వైరల్ చేసిన ఉదంతంపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. మంత్రిపై తప్పుడు వీడియోను వాట్సప్ గ్రూపుల్లో పంపించి తమ మనోభావాలను దెబ్బ తీశాడని పేర్కొంటూ మనిగిళ్ల గ్రామ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివ, చంద్రశేఖర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో విచారణ చేపట్టిన పోలీసులు గురువారం శివయాదవ్‌ను రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

పంటల సాగులో జాగ్రత్తలు తప్పనిసరి


జానంపేటలో వరి పంటలను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ భరత్ భూషన్

అడ్డాకుల: పంటల సాగులో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సీహెచ్ భరత్ భూషన్ సూచించారు. మూసాపేట మండలంలోని జానంపేట, నిజాలాపూర్, మూసాపేట గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చౌడు భూముల్లో వరి సాగు చేసే రైతులు ముందుగా వానాకాలంలో జీలుగ, జనుము విత్తనాలను చల్లుకుని వాటి మొక్కలకు పూత రాకముందే సూపర్ వేసి కలియదున్నితే భూమి సారవంతమవుతుందని పేర్కొన్నారు. రైతులు కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, యూరియా ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఉన్న ప్రాంతాల్లో గుళికల మందును వాడాలని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త పి.అర్చన, మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి, ఏఈఓ నివేదిత ఉన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో కుక్కల స్వైరవిహారం


కుక్కదాడిలో గాయపడిన చందు

నవాబుపేట: మండలంలో కుక్కకాట్ల కలకలం మండల ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. గురువారం ఏకంగా మండల కేంద్రంతో పాటు నాలుగు గ్రామాల్లో కుక్క కాట్లు చోటుచేసుకున్నాయి. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు చికిత్స చేయించుకున్నారు. మండల కేంద్రంలో వాలీబాల్‌గ్రౌండ్‌లో నుంచి ఇంటికి వెళ్తున్న చందు(14) అనే బాలుడిని ఓ కుక్క కాటువేసింది. సమీపంలో ఉన్న యువకులు కర్రలతో బెదిరించటంతో వెళ్లిపోయింది. దీంతో పాటు చౌడూర్, పోమాల్, కారూర్ గ్రామాల్లో ఒక్కొక్కరు కుక్కకాటు బారినపడ్డారు. వారికి మండల వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి టీకాలు వేసి, చికిత్స అందించారు. అలాగే ఇప్పటికే హన్మసానిపల్లి, గోవానిపల్లి గ్రామాల్లో ఇద్దరికి కుక్క కరిచింది. దీంతో వారికి సైతం ఇప్పటికే చికిత్స అందించినట్లు ఆమె వివరించారు.

ఒకేసారి ఐదుకుక్కలు దాడి


మానవపాడులో గాయపడిన హనుమంతురావు

మానవపాడు: ఓ వ్యక్తిపై ఒకేసారి ఐదు కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ఈ సంఘటన గురువారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన హనుమంతరావు అనే వ్యక్తి ఉదయం 5.30 గంటలకు వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. దీంతో ఆయనపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, చికిత్స చేయించారు. గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, కుక్కలపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నగదు చోరీ: కేసు నమోదు

మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలోని మాలమ్మ, భర్త సాబెన్న బుధవారం ఉదయం వారి ఇద్దరి కుమారులను పాఠశాలకు పంపించారు. అనంతరం తొమ్మిది గంటల సమయంలో ఇంటికి తాళం వేసి భర్తతో కలిసి మక్తల్ మండలం కల్వాల్‌కి బండారు పూజకు వెళ్లింది. పాఠశాల నుంచి వచ్చిన కుమారులు ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన గ్రామానికి చేరుకుని ఇంట్లోని వస్తువులను పరిశీలించగా.. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నట్లు గుర్తించారు. పెట్టెలోని రూ.47,700లతో పాటుగా రెండు గ్రాముల బంగారం, చెవి కమ్మలు చోరీకి గురయ్యాయని బాధితురాలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వరుసకు కుమారుడైన మహేష్‌ను అనుమానితుడిగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలియజేశారు.

రామన్‌పాడుకు 1063 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో గురువారం నాటికి 1,020 అడుగుల నీటిమట్టం ఉంది. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 920 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 143 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాలువ ద్వారా 900 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

కోడేరు: మండలంలోని జనుంపల్లిలో వెలిసిన మంత్రాలమ్మ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు షిడే కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూల నుంచి వేలాది మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవం పురస్కరించుకుని భక్తులు పూనకాలు, బోనాలు, గొర్రె పొటేళ్లు, కోడి పుంజులతో చేశారు. పూజారి రాములును రథం కర్రకు కట్టి ఆలయం చుట్టూ తిప్పారు. పూర్వకాలం నుంచి ఇలా ఆలయం చుట్టు భక్తులకు పసుపు బండరాళ్లతో ఆశీర్వదిస్తామని పూజారి తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రాంత ప్రజలను చల్లగా చూడాలని పాడి పంటలు సమృద్ధిగా పండేలా చూడాలని అమ్మవారిని కోరారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జాతరలో ఇబ్బందులు కలగకుండా చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట జనుంపల్లి సర్పంచ్ కవిత, కోడేరు సర్పంచ్ వెంకటస్వామి, రాజశేఖర్‌గౌడ్, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజారిని కర్రకు కట్టి ఆలయం చుట్టూ తిప్పుతున్న భక్తులు


పూనకంతో ఊగిపోతున్న మహిళ


మంత్రాలమ్మ దర్శనం కోసం క్యూలో నిలబడిన భక్తులు


క్లుప్తంగా...

దిగజారిన 'ఈనాడు'

- అసత్య ప్రచారం మరోసారి బట్టబయలు
- ఏపీ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మండిపాటు



అమర్



కొమ్మినేని

సాక్షి, అమరావతి: సీహెచ్ రామోజీరావు సారథ్యంలోని ఈనాడులో నిజాయితీ లోపించిందని.. మోసపూరిత, కుట్ర పూరిత అసత్య ప్రచారం మరోమారు తేటతెల్లమైందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావులు మండిపడ్డారు. పాత ఫొటోలతో పాఠకులను మోసం చేయడం దురదృష్టకరమని గురువారం వారు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. అసలు నిజం బయట పడ్డాక, అది సాంకేతిక లోపం వల్ల జరిగిందంటూ లోపలి పేజీలో సింగిల్ కాలమ్ వార్తతో సమర్థించుకునే యత్నం మరీ అభ్యంతరకరంగా ఉందన్నారు. ప్రభుత్వంపై, పోలీసులపై ప్రజల్లో వ్యతిరేకత పెంచే లక్ష్యంతో రాసినట్లున్న ఆ కథనంలో 2021 ఫిబ్రవరి 3వ తేదీ నాటి ఫొటోలను ముద్రించడం దారుణమని వ్యాఖ్యానించారు. ఆ ప్రకటనల్లో వారు ఇంకా ఏమేం చెప్పారంటే.. టీడీపీ నేత పట్టాభికి సంబంధించిన వార్తలు బ్యానర్ గానే కాకుండా.. పుంఖానుపుంఖాలుగా మూడు పేజీల్లో పరిచిన తీరు ఆశ్చర్యం కలిగించింది. ఈనాడు తన వివరణను, విచారాన్ని మొదటి పేజీలో వేసి ఉంటే పత్రికా ప్రమాణాలను పాటించినట్లుండేది. తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబు నాయుడుకు వత్తాసు పలికే క్రమంలో రామోజీరావు, ఆయన మీడియా నిస్సిగ్గుగా విశ్వసనీయతనే పణంగా పెట్టి అభూత కల్పనలకు పాల్పడి పరువు పోగొట్టుకుంది. ఈ ఘటనతో అయినా కళ్లు తెరవాలి. తాము ఏం రాసినా జనం నమ్మేస్తారనుకుని ఇంతకాలం జనాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈనాడు వంకర రాతల గుట్టును సోషల్ మీడియా రట్టు చేసింది. పోలీసులు తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధించారన్న పట్టాభి మాటలను పట్టుకుని, కనీసం విచారించకుండానే ప్రభుత్వ ప్రతిష్ఠ దిగజార్చాలనుకోవడం తగదు. ఈనాడుతో పాటు చంద్రబాబు విధేయ పత్రికలు, న్యూస్ చానల్స్ తమ వంకర, పక్షపాత, కుట్రపూరిత, మోసపూరిత ధోరణులకు ఇకనైనా స్వస్తి చెప్పాలి.

కట్టుకథలు రాస్తున్న ఈనాడుపై జనాగ్రహం

రాష్ట్ర వ్యాప్తంగా 'ఈనాడు' ప్రతులు దహనం.. ఉవ్వెత్తున ఎగిసిన నిరసనలు

- పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు కథనం
- సోషల్ మీడియాలో బట్టబయలు కావడంతో లోపలి పేజీలో సవరణ
- రామోజీ తీరుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల మండిపాటు
- ఈ పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికని నినాదాలు
- చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతో దిగజారిన పాత్రికేయం
- చంద్రబాబు మేలే లక్ష్యంగా రామోజీరావు కుట్ర సిద్ధాంతం



కొయ్యలగూడెంలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సాక్షి, అమరావతి: ప్రజలను తప్పుదోవ పట్టించేలా 'ఈనాడు'పత్రిక అసత్య కథనాలు వండి వారుస్తోందని, వారికి అనుకూలమైన చంద్రబాబును సీఎంను చేయాలనే కుట్రతో దిగజారుడు వార్తలు ప్రచురిస్తోందని ఏపీ వ్యాప్తంగా నిరసన ఎగసిపడింది. తప్పుడు వార్తలు రాసి.. ప్రజలను మోసం చేస్తున్న ఈనాడు పత్రిక ప్రతులను గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజా సంఘాలు, సోషల్ యాక్టివిస్టులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజక వర్గ, మండల కేంద్రాల్లో దహనం చేశారు. రామోజీ రావు ఇంతగా దిగజారిపోవడం దారుణం అని ఛీకొట్టారు. పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, ప్రభుత్వం మీద బురదజల్లడానికి ఈనాడు చేసిన కుట్ర మరోసారి బట్టబయలు కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వెత్తున నిరసనలు ఎగిసిపడ్డాయి. వైఎస్సార్, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్న సెంటర్లల్లో ఈనాడు రామోజీ రావు విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అవి 2021లోని ఫొటోలని సోషల్ మీడియా ద్వారా వైరల్ కావడంతో ఎవరికీ కనిపించని రీతిలో రెండో పేజీలో సింగిల్ కాలంలో 'సవరణ'వేసి చేతులు దులుపుకుందని ఆందోళనకారులు మండిపడ్డారు. ఈనాడు పత్రిక పుట్టిందే అసత్య వార్తలు రాయడానికి అని పెద్ద ఎత్తున నినదించారు. చంద్రబాబును సీఎం చేయాలనే కుట్రతోనే ఈనాడు పత్రిక దిగజారుడు వార్తలు, కథనాలు రాస్తోందని మంత్రులు ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చి, చంద్రబాబుకు ప్రజలను చేరువ చేయాలని రాజగురువు రామోజీ కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు దుయ్యబట్టారు. అసత్యాలను ప్రచారం చేస్తున్న ఈనాడు పత్రికను బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.

ఇవి సోషల్ మీడియా రోజులు

పట్టాభి అనే వ్యక్తి జాతీయ నేతలా ఎల్లో మీడియా జాకీలు వేసి లేపుతోందని, ఇవి ఎల్లో మీడియా రోజులు కావని.. సోషల్ మీడియా రోజులు అని ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎల్లో మీడియా అని ముద్దుగా పిలుచుకునే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, అనుబంధ సంస్థలు ప్రచురిస్తున్న, చూపుతున్న వార్తలు, కథనాలు చూస్తుంటే ఇంకా దిగజారిపోవడానికి వారికి మెట్లు ఏమీ లేవు అని నిరూపించుకున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు మాత్రమే బాగుండాలనేది రామోజీరావు సిద్ధాంతం.. రామోజీరావుకు వయసు పెరిగి.. బుద్ధి మందగించిందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తూర్పారబట్టారు. కుట్రల రామోజీని బట్టలూడదీసి ప్రజల ముందు నిలబెడతామని మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) హెచ్చరించారు. దుష్ప్రచారం చేసేటప్పుడు బ్యానర్ ఐటమ్స్.. సవరణకు మాత్రం సింగిల్ కాలమా? అని మాజీ మంత్రి కురసాల కన్నబాబు నిలదీశారు. రామోజీ ఆరాటమే తప్ప.. చంద్రబాబుకు రాజకీయ భవిష్యత్ లేదని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. సంబంధం లేని ఫొటోలను ప్రచురించి ప్రజలను మోసం చేయాలని ఈనాడు యాజమాన్యం కుట్ర చేసిందని, సోషల్ మీడియా దెబ్బకు దిగొచ్చిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ శాసన సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు.

రామోజీరావు దిష్టి బొమ్మ దహనం

దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని రీతిలో ఆంధ్రప్రదేశ్‌లో అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన ప్రభుత్వంపై ఈనాడు విషం చిమ్ముతుండటాన్ని ప్రజలు ఛీకొడుతున్నారని విజయవాడలో పలువురు నేతలు మండిపడ్డారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామోజీరావు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆ మంటల్లో ఈనాడు ప్రతులను తగులబెట్టారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి తప్పుకుంటున్నాం

ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు దివాకర్

సాక్షి, అమరావతి: జాయింట్ యాక్షన్ కమిటీలో ఉన్న సంఘాల సమష్టి నిర్ణయం మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నుంచి ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ తప్పుకుంటోందని ఆ కమిటీ చైర్మన్ వీఎస్ దివాకర్ స్పష్టం చేశారు. ఇక నుంచి తమకు ఆ సంఘంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చర్యల వల్ల ఉద్యోగులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున, ఉద్యోగులందరూ ఆ సంఘానికి దూరంగా ఉండాలని సూచించారు. గురువారం ఏపీ రెవెన్యూ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం తాడేపల్లిలో నిర్వహించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. 'ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వంపై పబ్లిసిటీ కోసం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం అభ్యంతరకరం. ఈ ఘటన వల్ల ఉద్యోగుల మనోభావాలు దెబ్బతిన్నాయి'అని తెలిపారు.



కొత్త గవర్నర్‌తో సీఎం దంపతుల భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర నూతన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన సతీమణి సమీర నజీర్‌లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతిరెడ్డి గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాజ్‌భవన్‌కు చేరుకున్న సీఎం దంపతులకు గవర్నర్ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్, రాజ్‌భవన్ అధికారులు స్వాగతం పలికారు. సీఎం జగన్ దంపతులు గవర్నర్ దంపతులను శాలువతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. అనంతరం గవర్నర్ అబ్దుల్ నజీర్ సీఎం జగన్‌ను శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన అబ్దుల్ నజీర్ బుధవారం రాత్రి విజయవాడకు చేరుకున్న విషయం తెలిసిందే. ఆయన శుక్రవారం గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే

- పట్టాభి ఘటనపై రామోజీకి ఏపీ మంత్రి అంబటి అల్టిమేటం
- నేటి సాయంత్రం వరకు గడువు ఇస్తున్నాం
- క్షమాపణ కోరకుంటే నేరపూరిత పరువు నష్టం దావా వేస్తాం
- రామోజీ అక్రమ సామ్రాజ్యానికి రక్షకుడు చంద్రబాబే



సాక్షి, అమరావతి: తప్పుడు కథనాలను ప్రచురిస్తున్న ఈనాడుపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో వైఎస్సార్‌సీపీ యుద్ధం చేస్తుందని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. పట్టాభి ఘటనలో సాంకేతికంగా జరిగిన తప్పులకు చింతిస్తున్నట్లుగా ఎవరికీ కనపడకుండా రామోజీరావు నాలుగు ముక్కలను ప్రచురించడం కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రంలోగా ప్రభుత్వానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే నేరపూరిత పరువు నష్టం దావా (క్రిమినల్ డిఫర్మేషన్) వేస్తామని హెచ్చరించారు. మంత్రి అంబటి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

టీడీపీ పోర్న్ స్టార్లతో బూతులు..

రాజకీయంగా కథ ముగిసిన చంద్రబాబు పునరుజ్జీవం కోసం సీఎం జగన్, ప్రభుత్వంపై బురద జల్లుతూ తప్పుడు కథనాలను ప్రచురిస్తారా? టీడీపీ పోర్న్ స్టార్‌లు పట్టాభి, లోకేశ్, చింతకాయల అయ్యన్నలతో సీఎం జగన్‌ను బూతులు తిట్టిస్తూ చంద్రబాబు సైకోలా ఆనందిస్తుంటే ఆర్థిక నేరగాడు రామోజీరావు వాటిని ప్రచురించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. మార్గదర్శి ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడి రూ.వేల కోట్లతో రామోజీ నిర్మించుకున్న అక్రమ సామ్రాజ్యానికి చంద్రబాబు రక్షకుడిలా వ్యవహరిస్తున్నారు. రామోజీ ఆరాటమేగానీ రాజకీయంగా చంద్రబాబు బతికి బట్టకట్టడం అసాధ్యం.

ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా కె.జానకీరామిరెడ్డి మరోసారి గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి ఉప్పుటూరు వేణుగోపాలరావుపై 20 ఓట్ల తేడాతో గెలిచారు. మొత్తం 1,438 ఓట్లు పోల్ కాగా.. జానకీరామిరెడ్డికి 703, వేణుగోపాలరావుకు 683, మరో అభ్యర్థి డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబుకు 38 ఓట్లు వచ్చాయి. కొన్ని ఓట్లు చెల్లలేదు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా జానకీరామిరెడ్డి గెలుపొందడం ఇది వరుసగా రెండోసారి. కాగా ఉపాధ్యక్షుడిగా పీఎస్‌పీ సురేష్‌కుమార్ గెలుపొందారు. ఆయన తన సమీప అభ్యర్థి తుహిన్ కుమార్‌పై 52 ఓట్ల తేడాతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా వి.సాయికుమార్, సంయుక్త కార్యదర్శిగా సాల్మన్ రాజు, కోశాధికారిగా బీవీ అపర్ణలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా జ్ఞానేశ్వరరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి పితాని, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా అన్నం శ్రీధర్, మారుతి విద్యాసాగర్, కాశీ అన్నపూర్ణ, షేక్ ఆసిఫ్, శాంతికిరణ్, శరత్, అచ్యుత రామయ్య విజయం సాధించారు.

ఢిల్లీ ఎగ్జిబిషన్‌లో 'అడ్డాకుల' స్టాల్



ఢిల్లీ ఎగ్జిబిషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసిన శ్రుతిరెడ్డి

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన వరలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలు శ్రుతి రెడ్డి న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ఇంటాచ్ ఉత్సవ్‌లో స్టాల్ ఏర్పాటు చేశారు. వేస్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేయడంలో నిపుణురాలైన ఆమె తెలంగాణ నుంచి డీఆర్‌డీఏ సహకారంతో ఢిల్లీ ఎగ్జిబిషన్‌కు పంపించారు. వేస్ట్ పేపర్‌తో రూపొందించిన అందమైన కళాకృతులను ఆమె స్టాల్‌లో ప్రదర్శించారు. బుధవారం నుంచి మొదలైన స్టాల్ నాలుగు రోజుల పాటు సాగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 35 స్టాళ్లను ఏర్పాటు చేయగా అందులో ఈమెకు అవకాశం కల్పించారు. గతంలో ప్లాస్టిక్ రహితంగా వివిధ రకాల గృహోపకరణాలు, వినాయకుడి ప్రతిమలు, ప్లాస్టిక్ కవర్లకు బదులు పర్యావరణ కుండీలు తయారు చేసి అందరి దృష్టిని ఆకర్షించారు. అటువంటి వాటిని ఇప్పుడు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించి విక్రయిస్తున్నట్లు ఆమె తెలిపారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో రూ.25లక్షల టోకరా



మహబూబ్‌నగర్ క్రైం: క్రిప్టో కరెన్సీ పేరుతో ఓ వ్యక్తిని భారీ మోసం చేశారు. వన్‌టౌన్ సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. అయితే జిల్లా కేంద్రంలోకి క్లాక్‌టవర్ ఏరియాలో ఉన్న ఐఎంఎస్ ట్రేడర్స్ క్రిప్టో కరెన్సీ పేరుతో వ్యాపారం చేస్తుంటారని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి వారితో వ్యాపారం చేయడానికి ముందుకు వచ్చాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి క్రిప్టో కరెన్సీ వ్యాపారం కోసం గతేడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఐఎంఎస్ ట్రేడర్స్ నిర్వాహకులకు రెండు దఫాలుగా రూ.25లక్షలు నగదు ఇచ్చి 60రోజుల్లో రెండింతలు దాదాపు రూ.50లక్షలు ఇచ్చేవిధంగా అగ్రిమెంట్ చేసుకున్నాడు. అయితే గడువు దాటిపోయిన ఐఎంఎస్ ట్రేడర్స్ డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి గురువారం ఫిర్యాదు చేశాడని, అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేసు

మహబూబ్‌నగర్ క్రైం: వినియోగదారుల నుంచి రుణ వాయిదాలు వసూలు చేసిన నగదును సొంతంగా వాడుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు గతేడాది న్యూటౌన్‌లో ఉన్న మహీంద్ర ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్యాలయంలో ఫైనాన్స్ కలెక్ట్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే వినియోగదారుల నుంచి రుణ వాయిదా డబ్బులు రూ.3,88,250వసూలు చేసి సొంతంగా వాడుకున్నాడు. మేనేజర్ సాయినాథ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'పేట'ఎమ్మెల్యేకు సేవారత్న అవార్డు



అవార్డు అందజేస్తున్న హెచ్ఎంఆర్ఎఫ్ఏ సంస్థ నిర్వాహకులు

నారాయణపేట: హయత్ మెడికల్ రిలీఫ్ ఫెడరేషన్ ఆఫ్ అమెరికా నిర్వాహకులు నారాయణపేట నివాసి డాక్టర్ ఖుత్బుద్దీన్ ఆధ్వర్యంలో గురువారం ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి సేవారత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ఆవిర్భావంతో వెనకబడిన ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధిలో అడుగులు వేస్తున్నదన్నారు. అందరి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా హెచ్ఎంఆర్ఎఫ్ఏ నిర్వాహకులు డాక్టర్ ఖుద్బుద్దీన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి నేతృత్వంలో అభివృద్ధి సాధ్యపడుతున్నదన్నారు. జిల్లా కోసం ఎన్నో ఏళ్ల కష్టపడిన, సహకరించిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా ఆవిర్భావం కోసం ఉద్యమించిన వివిధ పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తదితరులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీ పాల్గొన్నారు.

'డబ్బు కోసం ఆశపడే వ్యక్తిని కాదు'

- మాజీ మంత్రి జూపల్లికృష్ణారావు



మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: డబ్బు కోసం ఆశపడే వ్యక్తిని కాదని, ఏ రూపాయి అన్యాయంగా సంపాదించలేదని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంతో పాటు మంచాలకట్ట, కొండూరులో గురువారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే రైతులు కరెంట్ బిల్లు కట్టకూడదని పోరాడి రూ.13కోట్ల బకాయి బిల్లును రైతులకోసం మాఫీ చేయించానన్నారు. మంత్రి పదవిని రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నానని గుర్తు చేశారు. బ్రిడ్జి కట్టింది ఒకరు.. డబ్బులు తీసుకున్నది ఇంకొకరని అన్నారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాయమాటలు చెప్పి, భయ పెడుతూ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారన్నారు. రౌడీ రాజ్యంగా పోలీసులతో అమాయక ప్రజలను ఇబ్బంది పెట్టడం పెడుతున్నారని విమర్శించారు. కల్యాణలక్ష్మి విషయంలో సంతకం కొరకు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాజకీయం చేయడం సరికాదని ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. నా హయాంలో చేసిన కొల్లాపూర్ అభివృద్ధే తప్పా ఆయన గెలిచాక చేసిందేమి లేదని ఎమ్మెల్యేపై మండిపడ్డారు. అంతేకాకుండా నియోజకవర్గానికి లక్షా30వేల ఎకరాలకు నీళ్లు తెచ్చిన ఘనత తనదే అన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు ఎప్పుడు అండగానే ఉంటానని, భయపడవద్దని తెలియజేశారు. కార్యక్రమంలో కోట్ల సురేందర్, రామన్‌గౌడ్, గోవింద్‌గౌడ్, ధర్మతేజ, గోపినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర దీక్ష అమలు పరిశీలన



కొత్తకోట రూరల్(పెద్దమందడి): మండల పరిధిలోని మనిగిల్ల జెడ్పీహెచ్ఎస్‌లో 23 రోజులుగా కొనసాగుతున్న 'అక్షర దీక్ష' కార్యక్రమాన్ని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఆర్‌డీఎస్) సంస్థ బృందం సభ్యులు పరిశీలించారు. అక్షర దీక్షతో విద్యార్థులు తెల్లవారుజామున చదువుకునే విధంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతో గురువారం తెల్లవారుజామున ఆర్డీఎస్ సంస్థ సభ్యులు మనిగిల్ల గ్రామానికి చేరుకుని విద్యార్థుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. అక్షర దీక్షతో తమ పిల్లలు తెల్లవారుజామున లేచి చదువుకుంటున్నారని సంస్థ సభ్యులకు విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ సంస్థ సభ్యులు చిన్నమ్మతామస్, శ్రీలక్ష్మి, జ్యోతి, పీఈటీ శ్రీరాములు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు




లక్ష్మీచెన్న కేశవస్వామి ఆలయం

అమ్రాబాద్: మండలంలోని మద్దిమడుగు ప్రధాన రహదారిలో అటవీ ప్రాంతంలో 300 అడుగుల ఎత్తులో రాయలగండి క్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రంలో మహిమాన్వితుడు లక్ష్మీచెన్నకేశవస్వామి కొలువుదీరాడు. ప్రతి ఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహకులు అన్ని చర్యలు తీసుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ ప్రాంగణంలో మౌలిక వసతులు కల్పించారు.

స్వామి వారి కల్యాణ నిర్వహణపై వివాదం

ప్రతిఏటా స్వామి వారి కల్యాణ తంతులో మాల కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఈ ఏడాది రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడంతో రెండు వర్గాలుగా చీలారు. ఒక వర్గం బీఆర్ఎస్‌కు, మరో వర్గం కాంగ్రెస్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకోవడంతో సమస్య పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. దీంతో పోలీసులు శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఇద్దరి మధ్య కొలిక్కి రాకపోవడంతో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కల్యాణం జరుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న వర్గం సమావేశాన్ని బహిష్కరించి వెళ్లారు. అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఏళ్ల తరబడి వస్తున్న ఆనవాయితీని కొనసాగించాలని నినాదాలు చేశారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.



అమ్రాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మార్కెట్‌లోకి 'స్మార్ట్ కీ ' స్కూటీ

పాలమూరు: హోండా కంపెనీ నుంచి అత్యంత స్మార్ట్ కీతో హోండా యాక్టివా మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్లు నర్మద హోండా ఎండీ వేణుగోపాల్ సింగ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని నర్మద హోండా షోరూంలో గురువారం యాక్టివా హెచ్-స్మార్ట్ స్కూటీని మార్కెట్‌లోకి తెలంగాణ జోనల్ మేనేజర్ ఇస్మాయిల్ ఖాన్, మహబూబ్‌నగర్ ఏరియా మేనేజర్ షలబ్ శ్రీవాత్సవ్ విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వేణుగోపాల్ సింగ్ మాట్లాడుతూ కొత్తగా స్మార్ట్ కీతో మార్కెట్‌లోకి తీసుకురావడం జరిగిందని, ఈ స్కూటీ ఆరు రంగులలో లభ్యమవుతుందన్నారు. వినూత్నమైన ఫీచర్స్‌తో కూడిన స్కూటీని హోండా కంపెనీ మార్కెట్‌లోకి తీసుకువచ్చిందన్నారు.



స్కూటీని విడుదల చేస్తున్న ప్రతినిధులు

యాక్టీవా హెచ్–స్మార్ట్ విడుదల

పాలమూరు: హోండా కంపెనీ నుంచి మార్కెట్‌లోకి అత్యాధునిక టెక్నాలజీతో కూడిన యాక్టివా హెచ్ స్మార్ట్ స్కూటీని గురువారం జిల్లా కేంద్రంలోని ఎలాన్ హోండా షోరూంలో ఎంవీఐ నరేష్, ట్రాఫిక్ సీఐ అశోక్, హోండా సెల్స్ హెడ్ ఇస్మాయిల్ ఖాన్, ఏరియా ఇన్‌చార్జ్ షలబ్ శ్రీవాత్సవ్ మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం సెల్స్ మేనేజర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన యాక్టీవా హెచ్-స్మార్ట్ స్కూటీ ధర ఎక్స్ షోరూం రూ. 82,138ఉందన్నారు. కార్యక్రమంలో ఎండీ సునీల్, సర్వీస్ మేనేజర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.



స్కూటీని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ప్రతినిధులు

పంప్‌హౌజ్‌ల పరిశీలన



మోటార్ల వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఈ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌ను నాగర్‌కర్నూల్ ఎస్ఈ వెంకటరమణ గురువారం పరిశీలించారు. గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌తో పాటు ఎల్లూరు రిజర్వాయర్ నుంచి మండల కేంద్రంలోని పంప్‌హౌజ్‌లకు నీటిని సరఫరా చేసి ఇక్కడి నుంచి చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోని దాదాపు 20 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందిస్తారు. గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌లో అమర్చిన మోటార్లు తరచూ చెడిపోతుండటంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వీపనగండ్ల సర్పంచ్ నర్సింహరెడ్డి, పెద్దదగడ సర్పంచ్ సురేందర్ సింగ్ ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని సామర్థ్యం ఉన్న మోటార్లను ఏర్పాటు చేయించి నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ సుధాకర్ సింగ్, డీఈ రమేశ్, ఏఈలు రామాంజనేయులు, మెగా కంపెనీ సైడ్ ఇంజినీర్ రాము, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.